సాక్షి సిద్దిపేట

ఆదివారం, 5, ఫిబ్రవరి, 2023




ఉజ్వల భవితకు సోపానం

వర్గల్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 8 తుది గడువు. 9లో..



జీఓ 59 అమలులో గందరగోళం

జీఓ 59తో క్రమబద్ధీకరణ అమలులో తలెత్తిన సమస్యలు మెదక్ మండలం మంబోజిపల్లి వాసులను కలవరపెడుతున్నాయి. 8లో..



ఆలయాలు ముస్తాబు 9లో..

బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి శివరాత్రి వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

న్యూస్‌రీల్

స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓ నం.58, 59 ద్వారా క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్థలాల క్రమబద్ధీకరణపై కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర పరిశీలన పూర్తయినందున తుది నిర్ణయం తీసుకొని క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేసి పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటి స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈడీఎం ఆనంద్, కలెక్టరేట్ ఏఓ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక ఆస్పత్రి వద్ద సెంట్రల్ లైటింగ్



లైటింగ్ పనులు చేపడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

దుబ్బాకటౌన్: దుబ్బాక 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు చేపట్టారు. ఇటీవల అంధకారంలో ప్రభుత్వ ఆస్పత్రి పాంగణం పేరిట 'సాక్షి'లో ఇటీవల ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితా భూంరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమ రాజ్‌సింగ్‌తో మాట్లాడి వెంటనే ఈ విషయాన్ని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేశారు. సుమారుగా రూ.10 లక్షలతో ఆస్పత్రి ప్రాంగణంతో పాటు రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ పనులు శనివారం ప్రారంభించారు. ఈ పనులను కమిషనర్ గణేశ్‌రెడ్డి పరిశీలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ ఎన్.శ్వేత సూచించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన వర్షిణి సెల్‌ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తి పార్ట్ టైం జాబ్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ ఉందంటూ ఒక లింకును పంపారు. అది నమ్మిన బాధితురాలు జాబ్ కోసం తన వివరాలు రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.12,500 డబ్బులు పంపింది. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేసింది. స్పందించిన పోలీసులు బాధితురాలు పంపిన ఖాతాలో ఉన్న రూ.5 వేల నగదును ఫ్రీజ్ చేశారని పోలీసులు తెలిపారు. సైబర్ నేరం జరిగిన వెంటనే లేదా 24గంటల్లోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

నకిలీ పురుగు మందులు విక్రయించొద్దు



తనిఖీ నిర్వహిస్తున్న శివప్రసాద్

గజ్వేల్: నకిలీ పురుగు మందులను విక్రయిస్తే సహించేదిలేదని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం గజ్వేల్‌లోని పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఎరువుల కొనుగోళ్లల్లో ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. బయో ఉత్పత్తుల కొనుగోళ్ల విషయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. తనిఖీల్లో గజ్వేల్ వ్యవసాయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

మోడల్‌గా పోలీస్ స్టేషన్లు

- నూతన కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు
- ఐదు పీఎస్‌లు, రెండు ఏసీపీ, ఒక సర్కిల్ ఆఫీస్
- రూ.27.87 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- త్వరలో టెండర్లకు ఆహ్వానం



అద్దె భవనంలో కొనసాగుతున్న సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్

సాక్షి, సిద్దిపేట: పోలీస్ వ్యవస్థ ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా సకల హంగులు.. అత్యాధునిక సౌకర్యాలతో కమిషనరేట్ పరిధిలో ఐదు పోలీస్ స్టేషన్లు, రెండు ఏసీపీ, ఒక సర్కిల్ కార్యాలయాలను నిర్మించనుంది. వీటిని మోడల్ పోలీస్ స్టేషన్‌లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో ఈ నిర్మాణాలకు మొత్తం రూ.27.87 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

- జిల్లాలో మూడు ఏసీపీ కార్యాలయాలు, 27 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. కాగా కొన్ని కార్యాలయాలు తాత్కాలిక భవనాల్లో, మరికొన్ని సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి.
- పోలీస్‌స్టేషన్లను జీ ప్లస్ వన్ నిర్మాణం చేయనున్నారు.
- 5 వేల స్క్వేర్‌ఫీట్ల విస్తీర్ణంతో ఈ భవనాలను నిర్మించనున్నారు.
- ఇందులో రిసెప్షన్ కౌంటర్, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలకు, రైటర్, హెడ్‌కానిస్టేబుల్‌లకు ప్రత్యేక గదులను నిర్మించనున్నారు.
- అలాగే ఇంటరాగేషన్, లాకప్‌లు, డార్మెటరీలు ఉండనున్నాయి. వీటితో పాటు 100 మందితో సమావేశం ఏర్పాటు చేసుకునే విధంగా ఒక హాల్‌ను నిర్మించనున్నారు.
- 2021లో సిద్దిపేటకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ మంజూరైంది. ఇప్పటివరకు తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. ఈ కార్యాలయ భవన నిర్మాణానికి రెడ్డి సంఘం సమీపంలో స్థలాన్ని కేటాయించారు. త్వరలో భవనం నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.
- త్వరలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెండర్లు పిలిచి నిర్మాణం పనులు ప్రారంభించనున్నారు.

కార్యాలయం	నిధులు(రూ.కోట్లలో)
హుస్నాబాద్ ఏసీపీ	2.84
గజ్వేల్ ఏసీపీ	2.84
గౌరారం సర్కిల్	1.73
ములుగు పీఎస్	3.86
గౌరారం	3.86
కుకునూరుపల్లి	3.86
సిద్దిపేట టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్	8.88

త్వరలోనే నిర్మాణాలు పూర్తి



కమిషనరేట్ ఏర్పాటు కావడం, అనతికాలంలోనే పటిష్టమైన పోలీస్‌శాఖ ఏర్పాటు, ప్రజారక్షణ, శాంతి భద్రతల విషయంలో సిద్దిపేట జిల్లా ఆదర్శంగా నిలుస్తోంది. జనాభా పెరగడం, కొత్త డివిజన్లు ఏర్పాటు కావడంతో కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వాటికి శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. అన్ని కూడా మోడల్ పోలీస్ స్టేషను, మోడల్ ఏసీపీ కార్యాలయాలుగా నిర్మిస్తాం. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు పూర్తి చేయిస్తాం.

–హరీశ్‌రావు, ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి

నేడు మల్లన్న మూడోవారం



ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు, శివశక్తి మండలి సభ్యులు తదితరులు పాల్గొంటారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తర్వాత వచ్చే సత్తేటి వారాల్లో నేడు మూడో ఆదివారం. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మల్లన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించనున్నారు. శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న భక్తులు ధూళి దర్శనం చేసుకున్నారు. కాగా భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు సిద్ధం చేశారు.

9వ తేదీన హుండీ లెక్కింపు

ఆలయంలో 9వ తేదీ స్వామివారి హుండీ లెక్కింపు ఉంటుందని ఈఓ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని బియ్యం హుండీలు, భక్తులు వేసిన కానుకలను లెక్కించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్ సిబ్బంది, ఆలయ అధికారులు, శివశక్తి మండలి సభ్యులు తదితరులు పాల్గొంటారు.

కంటి వెలుగు పేదలకు వరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటకమాన్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఒక వరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా చైర్మన్ రఘురాం అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంపును శనివారం ఆయన ప్రారంభించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎంతోమంది కళ్లల్లో ఈ కార్యక్రమం వెలుగులు నింపుతుందన్నారు. ఉద్యోగులు, న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి భవాని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి సల్మాఫాతిమా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, డాక్టర్ శ్రీకాంత్, నవీన్ రాజ్, సీనియర్ న్యాయవాదులు హరిచంద్ర, సాయిబాబా, రాజేశ్వర్‌రెడ్డి, కంటి వెలుగు క్యాంప్ ఇంచార్జ్ జాకీర్ హుస్సేన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన

సిద్దిపేటకమాన్: రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ.. ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు సిద్దిపేట బస్ డిపోలో ప్రైవేట్ డ్రైవర్లకు వృత్తి నైపుణ్యంపై రవాణ శాఖ, ట్రాఫిక్, ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శనివారం సీఐ రామకృష్ణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఒక డ్రైవర్ చేతిలో ఎంతో మంది ప్రయాణికుల జీవితాలు ఆధారపడి ఉంటాయన్నారు. వారికి ఎలాంటి హాని జరగకుండా నియమ నిబంధనలను పాటిస్తూ వాహనం నడపాలన్నారు. డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికులకు సుఖవంతమైన, సురక్షితమైన ప్రయాణం అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ ముందుకు సాగుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల పట్ల డ్రైవర్లు మృదు స్వభావంతో వ్యవహరించాలని సూచించారు. వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీలో తక్కువ ధరలో బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం రేటును తగ్గించాలి



సిద్దిపేటకమాన్: ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, క్రైమ్ రేట్ తగ్గించాలని డీజీపీ అంజని కుమార్ సూచించారు. హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నుంచి జిల్లా పోలీసు అధికారులతో పెండింగ్ కేసులు, పీడీ యాక్ట్, రానున్న శివరాత్రి జాతర్ల బందోబస్తు తదితర అంశాల గురించి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్టికల్ వారీగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో పారదర్శకంగా ఉండాలన్నారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తరచుగా శిక్షణ తరగతులు నిర్వహించి వారి పనితనాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, గజ్వేల్ ఏసీపీ రమేష్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, ట్రాఫిక్ ఏసిపి ఫణిందర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలీసులు జవాబుదారీగా ఉండాలి

పోలీస్ కమిషనర్ శ్వేత



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శ్వేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి జవాబుదారిగా విధులు నిర్వహించి ప్రజల ఆదారాభిమానాలు పొందాలని పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసరా ప్రాంతాల్లో నాటిన మొక్కలను పరిశీలించి, పచ్చదనాన్ని చూసి ఎస్‌ఐని అభినందించారు. అలాగే వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, అబ్బాండెడ్, వాహనాలను పరిశీలించి డిస్పోజల్ చేయాలని సూచించారు. 5 ఎస్ ఇంప్లిమెంటేషన్ పరిశీలించి ఫైల్ సక్రమమైన పద్ధతిలో ఉంచాలని ఉంచాలని, 5ఎస్ ఇంప్లిమెంటేషన్ చాలా బాగుందని అభినందించారు. ఈ సందర్భంగా ×నేను సైతం౹ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది పోటీపడి పడాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని తక్షణ సేవలు అందించాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతం కాబట్టి శాంతిభద్రతలను అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణమూర్తి, ఏఎస్‌ఐ రమణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఉపాధ్యాయుడికి గోల్డ్ మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సంపత్

నంగునూరు(సిద్దిపేట): జాతీయ స్థాయి 5కే రన్‌లో పాలమాకులకు చెందిన ఉపాధ్యాయుడు శిలాసగరం సంపత్ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆయన కోహెడ మండలం చెంచెల్ చెరువుపల్లి పాఠశాలలో తెలుగు పండిట్‌గా పని చేస్తున్నాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గత సంవత్సరం నవంబర్ 27న గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడంతో రాష్ట్రం నుంచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు ఐదో ఆలిండియా మాస్టర్స్ గేమ్స్ అథ్లెటిక్స్ 2023 చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించారు. అండర్ 40 విభాగంలో పాల్గొన్న సంపత్ మరోసారి గోల్డ్‌మెడల్ సాధించి ఔరా అనిపించాడు.

విగ్రహ ఏర్పాటుకు అడ్డొస్తే సహించేది లేదు

డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్



మాట్లాడుతున్న శంకర్

దుబ్బాక: అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎవరైనా అడ్డువస్తే సహించేది లేదని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య హెచ్చరించారు. రాయపోల్ మండలం బేగంపేటలో అంబేడ్కర్ యువజ సంఘం ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటుకు గద్దెను నిర్మించారు. కాగా సర్పంచ్, పోలీసులు విగ్రహ ఏర్పాటుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. గద్దెను తొలగించారు. దీంతో దళిత బహుజన, ప్రజా సంఘాల నాయకులు ఏకమై శనివారం గ్రామాన్ని సందర్శించి అదే ప్రదేశంలో గద్దెను పునఃనిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు వచ్చిన అభ్యంతరాలేమిటో సర్పంచ్, పోలీసులు వివరించాలన్నారు. దేశంలో గుడి, మసీద్, చర్చి, రాజకీయ నాయకులా విగ్రహాలు పెట్టడానికి లేని అనుమతులు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎందుకు అవసరమో చెప్పాలన్నారు. శాంతి భద్రతలు కాపాడే పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు దేవేందర్ నాయకులు లక్ష్మణ్, రాంచంద్రం, రాకేష్, స్వామి, వేదాంత్ మౌర్య, ఎల్లేష్, రాజయ్య, సంజీవ్, ప్రవీణ్, రాజు, వెంకటేస్, శ్రీను, తదితరులున్నారు.

డబుల్ ఇళ్ల జాబితాపై దుమారం



ఆందోళనలో పోలీసులతో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వాగ్వాదం



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- చోటు దక్కని పేదల ఆగ్రహం
- గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో.. ఉద్రిక్తత

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించి అధికారులు ప్రకటించిన అర్హుల జాబితాపై దుమారం రేగింది. ఈ జాబితాలో చోటుదక్కని పేదలు శనివారం రోడ్డెక్కారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పంపిణీపై అధికారులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. ఇళ్ల కోసం గతంలో 3,518 మంది పేదలు దరఖాస్తులు చేయగా 2021 జూన్ నెలలో అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో 1,118 మందిని అర్హులుగా తేల్చారు. ఈ జాబితా మున్సిపల్ కార్యాలయంలో, ఆర్డీఓ కార్యాలయాల వద్ద అతికించిన సంగతి తెల్సిందే. ఈ జాబితాలో తమ పేర్లు లేవని గుర్తించిన పేదలంతా ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. 2008 నుంచి తమకు ప్రస్తుతం డబుల్ బెడ్రూమ్ కాలనీ నిర్మించిన చోట ఇళ్ల స్థలాలు ఇవ్వగా.. 2014లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ స్థలాలు వాపస్ తీసుకొని ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇచ్చారని అప్పటినుంచి తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తూ అద్దె ఇళ్లల్లోనే నివాసముంటున్నామన్నారు. తీరా జాబితాలో చూస్తే పేర్లు లేకపోగా అనర్హులకు ఇచ్చారని మండిపడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు వల్లే అక్రమాలు చోటుచేసుకున్నాయని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి: నర్సారెడ్డి

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక తన సొంత నియోజకవర్గంలోని గజ్వేల్ పట్టణంలో పేదలకు 5వేల ఇళ్లు ఇస్తానని చెప్పి, కేవలం 1,250 మాత్రమే కట్టించారని తెలిపారు. 9 ఏళ్లుగా పంపిణీని పెండింగ్‌లో పెట్టి ప్రస్తుతం కేవలం 1,118 మందికి ఇవ్వడానికి జాబితా ప్రకటించారని మండిపడ్డారు. మిగిలిన అర్హులందరికీ ఇళ్లు ఇచ్చేంతవరకు బాధితుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో పోలీసులు అక్కడికి ఆందోళన విరమింపజేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో నర్సారెడ్డి వాగ్వాదానికి దిగారు. సుమారుగా గంటపాటు ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు చివరకు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

అన్యాయం జరగనివ్వం: ప్రతాప్‌రెడ్డి

ప్రస్తుతం ప్రకటించిన లబ్ధిదారుల జాబితా ఫైనల్ కాదని, ఇందులో అనర్హులపై ఆధారాలతో ఫిర్యాదు వస్తే తొలగించి అర్హులకు అందిస్తామని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. డబుల్ ఇళ్ల పంపిణీపై ఆందోళన కార్యక్రమాల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అనర్హులపై ఫిర్యాదులను అందజేయడానికి మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

క్లుప్తంగా

కాళ్లకల్ శివారు పొలాల్లో వరుస చోరీలు

మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్ శివారులో వరుస చోరీలు జరుగుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాళ్లకల్ శివారులోగల వ్యవసాయ పొలాలను దుండగులు టార్గెట్ చేసుకున్నారు. బోరు మోటర్లు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కాళ్లకల్ శివారులో ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గరలోగల గానుగు సురేందర్ పొలం నుంచి విద్యుత్ మోటర్ పంపు, వైర్లను చోరీ చేశారు. పక్కనే ఉన్న బీరప్పకు చెందిన ఇనుప సామగ్రి, దుకాణం పైరేకులను తొలగించి రూ. 40 వేలు, ఇనుప సామగ్రిని చోరీ చేశారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

గంజాయి పట్టివేత

50 కిలోలు స్వాధీనం

నారాయణఖేడ్: విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ఈదుల్ తండాలో శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు నిర్వహించారు.ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువ చేసే రూ.50 కిలోల ఎండుగంజాయిని గుర్తించారు. ఇంటి కుటుంబీకులు పరారవడంతో గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకుని ఖేడ్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు. గంజాయిని ఎవరు సాగుచేసినా, క్రయవిక్ర యాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరారీలో ఉన్నవారిని త్వరలో పట్టుకుంటామన్నారు.

గంజాయి కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

రేగోడ్(మెదక్): గంజాయి కేసులో ఒకరికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. శనివారం మెదక్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన పెద్దగొల్ల యాదయ్య 2015 నవంబర్‌లో గంజాయి సాగు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో మెదక్ ఫస్ట్ ఏడీజే కోర్టు జడ్జి లక్ష్మీ శారద నిందితుడికి ఐదేళ్ల కఠిన జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించారు. కోర్టు తీర్పు అనంతరం నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించారు.

ఉజ్వల భవితకు సోపానం

- వర్గల్ నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి ఆహ్వానం
- ఫిబ్రవరి 8 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 29న ప్రవేశపరీక్ష
- సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు

వర్గల్(గజ్వేల్): మంచు పొరలు వీడక ముందే ఆటపాటలతో బాలబాలికల సందడి.. వైవిధ్య భరిత విద్యాబోధన..అదో కొత్త బంగారు లోకం . నవభారతం అక్కడ విభిన్నంగా రూపుదిద్దుకుంటుంది. కలిసిమెలిసి చదువుకోవడం..ఆనందాన్ని పంచుకోవడం..రోజంతా అలుపులేకుండా ఉండగలగడం..చక్కని చదువుతో భవిష్యత్‌కు బాటలు వేసుకోవడం.. స్వయంకృషితో ఎవరికి వారే తమ భవితను దిద్దుకునే చదువుల కోవెల వర్గల్ నవోదయ విద్యాలయం. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని విద్యార్థులకు ప్రయోజనకరంగా ఈ నవోదయ ఏర్పాటైంది. ఈ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 8 తుదిగడువు. ఎంపిక పరీక్ష ఏప్రిల్ 29వ తేదీన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నవోదయలో సౌకర్యాలు, ప్రవేశ పరీక్ష తదితర వివరాలతో ప్రత్యేక కథనం..



వర్గల్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో విద్యార్థినులు

నాణ్యమైన విద్య

ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థుల ఉజ్వల భవితకు సోపానంగా కేంద్రప్రభుత్వం 1987లో సిద్దిపేట జిల్లా వర్గల్‌లో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. త్రిభాషా సూత్రం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తున్నది. సీబీఎస్‌ఈ సిలబస్ ప్రకారం 6 నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన ఉంటుంది. స్మార్ట్ క్లాసులు, క్రమశిక్షణాయుత విద్య, డూయింగ్ బై లెర్నింగ్, ప్రాక్టికల్ బోధన, స్టడీ అవర్స్, చదువుతోపాటు ఆటలపై శిక్షణ ఇస్తారు. సైన్స్, కంప్యూటర్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, వివిధ దిన, వార, మాస పత్రికలు, రెఫరెన్స్ గ్రంథాలతో లైబ్రరీ. దేనికదే ప్రత్యేకంగా నిలుస్తాయి. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు తదితర వసతులన్నీ ఉచితమే. ఇక్కడి విద్యార్థులు ఎందరో చదువులోను, ఆటల్లోను అత్యుత్తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

వసతుల సమాహారం

తరగతుల కోసం అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యం కోసం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, భోజన శాలలు, అధ్యాపకులకు, సిబ్బందికి క్వార్టర్లు ఉన్నాయి. ఆహ్లాదత పంచే వృక్ష సంపదతో విద్యాలయ అలరారుతుంది.



సైన్స్‌ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న దృశ్యం

అంతర్గత సీసీ రోడ్లు, స్ట్రీట్‌లైట్లు, జనరేటర్ సౌకర్యం, ప్రత్యేక వాహనం ఉన్నది.

రాష్ట్రంలోనే అత్యుత్తమ స్టేడియం

రాష్ట్రంలోనే అత్యుత్తమమైన 400 మీటర్ల ట్రాక్‌తో కూడిన స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, జిమ్ ఉన్నాయి. ఆటలలో శిక్షణ కోసం వ్యాయామోపాధ్యాయులు, సంగీత శిక్షణకు మ్యూజిక్ టీచర్, డ్రాయింగ్‌లో ప్రావీణ్యం సాధనకు డ్రాయింగ్ మాస్టర్ ఉన్నారు.

ఏప్రిల్ 29న నవోదయ పరీక్ష

6వ తరగతి ప్రవేశం కోసం ఏప్రిల్ 29న ఎంట్రెన్స్ టెస్ట్ జరుగుతుంది. ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. మొత్తం 80 సీట్లలో గ్రామీణ విద్యార్థులకు 75 శాతం, పట్టణ విద్యార్థులకు 25శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు. అందులో దివ్యాంగులకు 3 శాతం, షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 7.5 శాతం కనీస రిజర్వేషన్ ఉంటుంది. మొత్తంగా బాలికలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు.

ఉండాల్సిన అర్హతలు

- 2022-23లో ఉమ్మడి మెదక్ జిల్లా (సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట)లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- 3, 4 తరగతులు పూర్తి విద్యాసంవత్సరం చదివి, ఉత్తీర్ణులై ఉండాలి.
- 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ 30 (రెండు దినములు కలుపుకొని) మధ్య జన్మించి ఉండాలి.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



6వ తరగతిలో ప్రవేశం కోసం ఏప్రిల్ 29వ తేదీన ఎంట్రెన్స్ పరీక్ష జరుగుతుంది. ఈనెల 8 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://నవోదయ.గవ్.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో నమూనా ప్రకారం ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసిన యోగ్యతా పత్రం. అభ్యర్థి పాస్‌పోర్టుసైజు ఫోటో, అభ్యర్థి, పేరెంట్ సంతకం చేసిన పత్రం. అభ్యర్థి ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన సెల్ నంబర్‌తో కూడిన దరఖాస్తు చేసేందుకు అవసరం. పూరించిన దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం 9951938677, 9440926144 సెల్‌ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. – రమేశ్ రావు, ప్రిన్సిపాల్, వర్గల్ నవోదయ

ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులపై కేసులు హేయమైన చర్య

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్



శంకర్

సిద్దిపేటఅర్బన్: ఎస్‌ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షలో తప్పుడు ప్రశ్నలు, తప్పుగా ముద్రించిన వారిపై లేని కేసులు తప్పుడు ప్రశ్నలకు ప్రభుత్వం బాధ్యత వహించి తమకు న్యాయం చేయాలని ఆందోళన చేసిన అభ్యర్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం రాష్ట్ర ప్రభుత్వ హేయమైన చర్యని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. శనివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులపై నమోదు చేసిన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ప్రశ్నలు వచ్చిన వాటికి ప్రభుత్వం బాధ్యత వహించాలని, దేహదారుఢ్య పరీక్షలో అభ్యర్థులకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలన్నారు. డీజీపీ ఆఫీస్ వద్ద నిరసన చేపట్టిన 12 మందిపై, అసెంబ్లీ వద్ద నిరసన తెలిపిన 16 మందిపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అన్నదమ్ములకు ..

కౌడిపల్లి(నర్సాపూర్): తమిళనాడులోని ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్శిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా స్వచ్ఛంద సంస్థ గౌరవ డాక్టరేట్ ఇచ్చినట్లు మండలంలోని వెల్మకన్నకు చెందిన అన్నదమ్ములు గంటం బొట్ల రవిప్రసాద్ శర్మ, ఉమాశంకర శర్మకు తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. సామాజికసేవలో రవిప్రసాద్‌శర్మకు, జ్యోతిషంలో ఉమాశంకశర్మకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. రవిప్రసాద్ శర్మ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తుండగా, ఉమాశంకశర్మ పౌరోహిత్యం చేస్తున్నాడు. శనివారం హైదరాబాద్‌లో సంస్థ ప్రతినిధులు డాక్టరేట్ అందచేసినట్లు తెలిపారు.

జీఓ 59 అమలులో గందరగోళం

- క్రమబద్ధీకరణలో సమస్యలు
- పరిష్కరించాలని కలెక్టర్‌ను వేడుకొన్న మంబోజిపల్లి గ్రామస్తులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంబోజిపల్లి సర్పంచ్ ప్రభాకర్, నాయకులు

మెదక్ రూరల్: దశాబ్దాల కాలంగా కూలీ పనులు చేసుకుంటూ ఈ ప్రాంతంలోనే నివసిస్తున్నాము. ప్రభుత్వం విడుదలచేసిన జీవో 59తో పూర్తిస్థాయి హక్కుదారులము కాబోతున్నామని సంతోషపడ్డాము. కానీ క్రమబద్ధీకరణ అమలులో తలెత్తిన సమస్యలు వారిని కలవరపెడుతున్నాయి. మా ఊరి గోడును తీర్చండి సారూ అంటూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రాజర్షి షాకు సర్పంచ్ గంజి ప్రభాకర్‌తో కలిసి పలువురు నాయకులు, గ్రామస్తులు శనివారం విజ్ఞప్తి చేశారు. మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామంలోని నివాస గృహాల యజమానులు ప్రభుత్వ ప్రకటన మేరకు జీఓ 59లో క్రమబద్ధీకరణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించారన్నారు. అయితే ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా అసలు సమస్య అక్కడి నుంచే మొదలైనట్లు వివరించారు. గ్రామంలో 380 పైగా నివాస గృహాల యజమానులు దరఖాస్తు చేసుకోగా, కేవలం 115 మందికి మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించినట్లు 2014 జూన్ 2 బేసిక్ వాల్యూ ప్రకారం క్రమబద్ధీకరణ చేయడంలేదని, రెట్టింపు విలువను వేసినట్లు తెలిపారు. 2014 జూన్ 2 విలువ ప్రకారం గజానికి రూ.600 మాత్రమే ఉందని, ఆ విలువలో 50 శాతం అంటే రూ.300 మాత్రమే ప్రభుత్వ ప్రకటన ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ రూ.860కు పైబడిన విలువతో క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని డిమాండ్ నోటీసులు అర్జీదారులకు పంపారని చెప్పారు. డిమాండ్ నోటీస్‌లో ఉన్న విలువ ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా ఉన్నందున పరిశీలించి సవరించాలని కోరారు. అదేవిధంగా సాంకేతిక లోపం కారణంగా కొందరు దరఖాస్తుదారులకు ఇంటి స్థలం విస్తీర్ణంలో మార్పులు రావడం జరిగిందని, మరికొందరి దరఖాస్తులను అర్హత ఉన్నప్పటికీ పలు కారణాల వలన తిరస్కరించినట్లు వాపోయారు. అలాంటి దరఖాస్తులను పునఃపరిశీలించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకులు, గ్రామస్తులు జయరాంరెడ్డి, రాములు, అంజాగౌడ్ తదితరులు ఉన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

కంది(సంగారెడ్డి): అనుమానస్పద స్థితిలో మహిళా మృతదేహం పోలీసులకు లభ్యమైంది. శనివారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందికి చెందిన వెంకటమ్మ(50) ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకుండా పోయింది. శనివారం మధ్యాహ్నం ఇళ్ల మధ్య ముళ్ల పొదల్లో ఓ మహిళ శవం కుళ్లిన స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలిని కందికి చెందిన వెంకటమ్మగా గుర్తించారు. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొన్న లారీ

దుబ్బాకరూరల్: భూంపల్లి మండల పరిధి చిట్టాపూర్ వద్ద శుక్రవారం రాత్రి సిద్దిపేట నుంచి వస్తున్న ఇసుక లారీ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో లారీ డ్రైవర్ సయ్యద్ హిమామ్(61)కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భూంపల్లి ఆస్పత్రికి తరలించారు.

హైనా దాడిలో దూడకు గాయాలు

చేర్యాల(సిద్దిపేట): హైనా దాడిలో దూడ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మండల పరిధి వీరన్నపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామస్తుడు పొన్నబోయిన కృష్ణమూర్తి వ్యవసాయ బావి వద్ద ఉన్న పశువుల పాకలోని దూడపై హైనా దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడిందని సర్పంచ్ కొండపాక భిక్షపతి తెలిపారు. హైనా ఇలా వరుస దాడులు చేస్తుండటంతో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారన్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

సర్పంచ్, కార్యదర్శులపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: సర్పంచ్, కార్యదర్శులపై కేసు నమోదైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శనివారం సీఐ వినాయక్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూర్ పశువుల వైద్యశాల స్థలంలో ఆ శాఖ అధికారులు అనుమతి లేకుండా ప్రహరీ కూల్చి, నిర్మాణాలు చేపడుతున్నారని భనూర్ సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి సంగీతపై భానూర్-బీడీఎల్ పోలీసు స్టేషన్‌లో మండల పశువైద్యాధికారి శైలేంద్ర ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బీడీఎల్ పోలీసు లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

నారాయణఖేడ్: పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత కొద్దిరోజులుగా ఖేడ్ పట్టణంతోపాటు మండలంలోని పలు చోట్ల డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడుపుతూ 28 మంది పట్టుబడ్డారు. వారిని శనివారం ఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి ప్రియాంక వారికి రూ.30 వేల జరిమానా విధించారు.

భవనం పైనుంచి పడిన విద్యార్థిని..

- తీవ్ర గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చేరిక
- సిర్గాపూర్ ఎస్టీ బాలికల గురుకులంలో ఘటన
- గురుకులానికి తాళాలు వేసిన వైనం

కల్హేర్(నారాయణఖేడ్): గురుకుల పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి పడిన విద్యార్థిని తీవ్ర గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన సిర్గాపూర్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం రాత్రి సంఘటన జరిగింది. కోహిర్ మండలం పిచ్చిరేగడి తండాకు చెందిన లక్ష్మి గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని లక్ష్మి భవనం రెండో అంతస్తుపై నుంచి కింద పడింది. తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. విద్యార్థిని ప్రమాదవశాత్తు కింద పడిందా? ఎవరైన పై నుంచి తోసేశారా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు పొక్కకుండా గురుకుల పాఠశాలకు గేట్లకు తాళలు వేశారు. ప్రిన్సిపాల్ శ్యామలదేవిని సాక్షి ఫోన్‌లో సంప్రదించగా విద్యార్థిని లక్ష్మి వాష్‌రూంకు వెళ్తానని తోటి విద్యార్థులతో చెప్పిందన్నారు. గురుకులంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. కాగా విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు.. ఒకరు మృతి

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడగా, ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎదురెదురుగా ఆటో కారు ఢీకొన్నాయి. దీంతో ఆరుగురు గాయపడ్డారు. మరో చోట బైక్‌ను ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ మరణించాడు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

రామాయంపేట(మెదక్): పట్టణ శివారు ఐటీసీ పెట్రోల్ పంపు వద్ద కారు, ఆటో ఢీ కొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమల్లారెడ్డి నుంచి రామాయంపేటకు ప్రయాణికులతో వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దమల్లారెడ్డికి చెందిన రేణుక, చాకలి కవిత, అక్కన్నపేటకు చెందిన కలవ్వ, బీహార్ రాష్ట్రానికి చెందిన అశోక్‌కుమార్, గుడ్డూ కుమార్, మరో ప్రయాణికుడు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన ఇద్దరిని హైదరాబాద్‌కు తరలించారు. ఈప్రమాదంలో ఆటో బాగా దెబ్బతిన్నది. ఈవిషయంపై వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

బైకును ఢీకొన్న ఆటో..

కొల్చారం(నర్సాపూర్): బైకును ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం కొల్చారం శివారు మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన మ్యాదరబోయిన నర్సింహులు తన బైక్‌పై మెదక పట్టణానికి వెళ్లి స్వగ్రామానికి వస్తున్నాడు. కొల్చారం శివారులోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో నర్సింహులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడ్డ నర్సింహులు

నృత్యకారిణికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న భవాని

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణానికి చెందిన నృత్యకారిణికి గ్లోబల్ పీస్ యూనివర్సిటీ డాక్టర్ ప్రదానం చేసింది. నృత్యకారిణి భవాని కూచిపూడి నృత్యంలో వేలాది మందికి శిక్షణ ఇచ్చింది. ఈమె కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్యం, పేర్నిలో ప్రావీణ్యం సాధించినందుకు తెలంగాణ స్టేట్ నుంచి ప్రథమ మహిళగా గుర్తించి గౌరవ డాక్టర్ ప్రదానం చేశారు. డాక్టరేట్‌ను ఊటీ యూనివర్సిటీ చైర్మన్, తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ సామల సదాశివుడు తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు.

నలుగురు సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

22 సెల్‌ఫోన్ల రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సెల్‌ఫోన్ చోరీచేసిన దొంగలను పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన సుభాన్, మహమ్మద్, ముర్షిత్ ఖాన్, పఠాన్ ఆలం, రషీద్ హత్నూర మండలం ముచ్చర్లలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నారు. జనవరి 23వ తేదీన పట్టణంలోని రజాకాంక్షన్స్ కిరాణా షాపులో రూ.2 వేల నగదు, సబ్బులు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మొబైల్ దుకాణం షట్టర్ పగులగొట్టి 31 సెల్ ఫోన్లు ఎత్తుకెళ్లారు. వాటిని ఐదుగురు సమానంగా పంచుకున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ అర్ధరాత్రి మళ్లీ దొంగతనానికి పాల్పడ్డారు. వారిని పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల విషయం బయటపడింది. ఐదుగురిలో నలుగురు పట్టబడగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నలుగురు నిందితుల నుంచి 22 సెల్ ఫోన్లు, శానం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. దొంగలను పట్టుకున్న సిబ్బందికి రివార్డ్ ఇచ్చేందుకు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం



కార్తీక్ రెడ్డి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగం చేయడం లేదని తండ్రి తన కుమారుడిని మందలించాడు. దీంతో కుమారుడు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధి పటేల్‌గూడ బీఎస్‌ఆర్ కాలనీకి చెందిన జైపాల్ రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి(26) కొద్ది రరోజులు ఉద్యోగం చేశాడు. కొంత కాలంగా ఇంటి వద్ద ఉంటూ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండటంతో తండ్రి మందలించాడు. దీంతో ఈనెల 2వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుమారుడి కోసం తండ్రి తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. కుమారుడి అదృశ్యంపై పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు..



మహమ్మద్ రఫీక్ (ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యమైనట్లు కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాసాన్‌పల్లికు చెందిన మహమ్మద్ రఫీక్ జనవరి 27వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు తెలిసిన చోట్ల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. భార్య తమీజ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్‌ఐ తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు కల్హేర్ సీఎస్ సెల్ 8712656761 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

అధికారులు భూమి లాక్కున్నారని..



అపస్మారక స్థితిలో బాలరాజు

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటి స్థలంలో జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడంపై తీవ్ర మనస్తాపం చెందిన వృద్ధుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన చికిత్స కోసం 108 ద్వారా సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరగడంతో కలకలం రేగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట గ్రామానికి చెందిన తిప్పరబోయిన బాలరాజు గత 20 ఏళ్లుగా నివసిస్తున్నాడు. గ్రామంలోని 127/27 సర్వే నంబర్‌లో అతడికి 27 గుంటల భూమి రికార్డుల్లో ఉంది. ఆ భూమిలో టీ కొట్టుతోపాటు జీవనోపాధికి రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు. ఆ భూమి ప్రభుత్వానికి చెందినదంటూ రేకుల షెడ్డును వెంటనే తొలగించాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి బాలరాజుకు జనవరి 27వ తేదీన రెవెన్యూ అధికారులు నోటీసులు అందించారు. తగిన ఆధారాలతో అదే నెల 28న తహసీల్దార్ కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి హాజరైనప్పటికీ 27 గుంటల భూమిలో 15 గుంటల భూమి ప్రభుత్వానిదని అధికారులు తేల్చి చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో తనకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోవడంతో శనివారం కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు భూంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలరాజును 108 లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.